# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



- మూడు గంటల కరెంటు అంటే ముప్పు తిప్పలే
- ఎకరం పొలమైనా తడుస్తదా..?
- 10హెచ్‌పీ మోటర్ పెట్టుకోవాలంటున్నరు.. వాళ్లు కొనిస్తరా..?
- ఇట్లా కరెంట్‌పై పూటకోమాట ఎందుకు మాట్లాడుతున్నరు
- మళ్లీ మా జీవితాలు నాశనం చేయడానికా..?

## కాంగ్రెస్‌ది కుట్రే

కరీంనగర్, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్‌కు ఓటేస్తే మా బతుకులు ఆగమైతయనే విషయం మాకు అర్థమవుతుంది. ఇప్పటికే ఆ పార్టీ నాయకులు రోజుకో మాట మాట్లాడుతున్నరు. మొదట్లనేమో మూడు గంటల కరెంటు ఇస్తే సరిపోతుందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నడు. మూడు గంటల్లో మూడెకరాలు పారుతుందన్నడు. ఎన్నడైనా ఎవుసం జేసినోడైతే ఇట్లా మాట్లాడడు.. అందుకే మాకు కోపమొచ్చింది. అందరం కలసి లొల్లిలొల్లిజేసినం. ఇగ ఇప్పుడు ఎన్నికలొచ్చినయి గదా..? మళ్లీ కొత్తపాట పాడుతుండ్రు. మూడు గంటల్లో మూడు ఎకరాల పొలం ఎట్లా పారుతుందంటే.. 10 హెచ్‌పీల మోటార్లు పెట్టాలంటుండ్రు. రైతు ఎవరైనా 10 హెచ్‌పీల మోటార్లు వాడుతడా? ఒకవేళ వాడితే ఇప్పుడు పెట్టిన ట్రాన్స్‌ఫార్మర్లు ఆగుతాయా? పోనీ పెట్టాల్సి వస్తే ఒక మోటారు, వాటికి కావాల్సిన పైపులు, అందుకు సరిపోయే విధంగా స్టాటర్ ఇలా అన్ని కలిపి ఒక్కో దానికి రూ.లక్ష మీదే అయితది. ఈ పైసలు ఎవరిస్తారు?. దీని మీద లొల్లి లొల్లి అయితనే ఉంది. దీన్ని జూసిన కాంగ్రెస్‌వోళ్లు ఇప్పుడు మరో మాట మాట్లాడుతుండ్రు. అట్లగాదు గానీ మేం కూడా 24 గంటల కరెంటు ఇస్తమంటుండ్రు. నెల రోజుల్లో మూడు మాటలు మాట్లాడింది జూసినం. అందుకే మేం ఆలోచన జేస్తున్నం. నిజానికి ఇప్పుడు మాకు కావాల్సినంత కరెంటు ఉంది. కేసీఆర్ వచ్చినంక ఢోకాలేకుండా పోయింది. కంటినిండా నిద్రపోతున్నం. మాకు అవసరమైనప్పుడు వెళ్లి మోటర్ పెట్టుకుంటున్నం. ఇన్ని సౌలతులుండంగా కాంగ్రెస్ ఓటు వేసి మా బతుకులు మేం ఆగం జేసుకోం. మునపటి లెక్క ఎడ్డి రైతులం కాదు. మాదాంటో చైతన్యం వచ్చింది. ఎవరేమిజేస్తుండ్రో చూస్తున్నం. ఎవరికి ఓటు ఏయాలో..? ఎవరిని దూరంగా పెట్టాలో..? మాకు తెలుసు. ఒక్క మాట జెప్పాలంటే మా బతుకుల్లో మేం మట్టియితే పోసుకోం అంటున్నారు జిల్లా రైతులు. వ్యవసాయరంగానికి ఇచ్చే ఉచిత విద్యుత్‌పై కాంగ్రెస్ పార్టీ ఆడుతున్న డ్రామాలు, పూటకో మాట తీరుపై జిల్లా రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తీరు. వారిమాట్లనే చూద్దాం.

### కాంగ్రెస్ మాటలు నమ్మలేం



కాంగెస్ పార్టీ చెబుతున్నట్టు మూడు గంటల కరెంటు.. 10 హెచ్ పీ మోటర్లతో ఎవుసం చేయలేం. మూడు గంటల కరెంటుతో కనీసం మడి కిందికి కూడా నీళ్లు పారవు. ఇగ పంటలెట్ల సాగు చేస్తం. కాంగెస్ మాటలు నమ్ముకుంటే పంటలను పండించడం కష్టమే. పది హెచ్‌పీ మోటర్ బిగిస్తే బావులల్ల నీళ్లు సరిపోవు. 10 హెచ్‌పీతో లాభాల కంటే మోటర్ల రిపేర్లకే సరిపోతది. తెలంగాణ ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న 24 గంటల కరెంటుతో సంతోషంగా సాగు చేసుకుంటున్నం.

**- పసునూటి మహేందర్‌రెడ్డి, రైతు, మల్లన్నపల్లి (ఇల్లందకుంట)**

### మూడు గంటలతో ఆగమే



మూడు గంటల కరెంటుతో రైతులకు వెనుకటి తిప్పలు మొదలైనట్లే. ఎప్పుడస్తదో, ఎప్పుడు పోతదో తెల్వక బాయిల కాడనే సంసారాలు చేయాలె. నాడు రైతులు పడ్డ ఇబ్బందులు మళ్లీ ముందుకస్తయి. రాత్రనక, పగలనక బావుల కాడికి వెళ్లి వందల మంది రైతులు పాము కాట్లకు, కరెంటు షాక్‌లకు బలయ్యారు. మూడు గంటల సరఫరా కేవలం ఆయకట్టు ప్రాంతాలకు మాత్రమే ఉపయోగపడుతది. వాణిజ్య పంటలు పండించే మాలాంటి మెట్ట ప్రాంత రైతుల పరిస్థితులు మళ్లీ మొదటికొస్తయి. పంటలకు నీటి తడులు పెట్టేందుకు ఒక్కో బావి దగ్గర ముగ్గురు ఉండాల్సి వస్తది. ఇప్పుడున్న కరెంటుతో మా బావి వద్ద త్రీ హెచ్‌పీ మోటర్‌తో ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఎవుసం చేస్తున్న. 10 హెచ్‌పీ మోటర్ ఏర్పాటు చేస్తే అటు ట్రాన్స్‌ఫార్మర్లపై, ఇటు మోటర్లపై తీవ్ర ఒత్తిడి పెరిగి, కాలిపోయే ప్రమాదం ఉంది. వీటిని మరమ్మతులు చేయిస్తే, కొన్న ధరను మించి మెకానిక్‌లకు చెల్లించాలి.

**- పోరెడ్డి నరేందర్‌రెడ్డి, రైతు, బద్దిపల్లి, కొత్తపల్లి మండలం(కలెక్టరేట్)**

### రేవంత్ మెదడు మోకాళ్లోకి వచ్చినట్టుంది



మూడు గంటల కరెంటు ఇస్తానంటున్న రేవంత్‌రెడ్డికి మెదడు మోకాళ్లోకి వచ్చినట్టుంది. ఆయన డాక్టరుకు చూపెట్టుకుంటే మంచిది. 10 హెచ్‌పీ మోటర్‌తో వ్యవసాయం చేయాలంటున్న రేవంత్ రెడ్డికి ఓట్లతో బుద్ధి చెప్పాలె. నోటితే అనడం సులువుగానే ఉంటది. పాత మోటరు ఒకవేళ మరమ్మతు చేయాల్సి వస్తేనే రైతులు పైసల కోసం అష్టకష్టాలు పడుతరు. రేవంత్‌రెడ్డి చెప్పినట్టు 10 హెచ్‌పీ మోటరు కొత్తది కొనాలంటే సాధ్యమైతదా? కాంగ్రెసోళ్లు చెప్పాలె. మూడు గంటల కరెంటు, 10 హెచ్‌పీ మోటరు అంటూ అడ్డదిడ్డంగా మాట్లాడుతున్న రేవంత్ రెడ్డికి రైతుల చేతిలో గుణపాఠం తప్పదు.

**- ఆకుల రవి, కొత్తపల్లి, (హుజూరాబాద్)**

### ధరణి వచ్చినంక అక్రమాలు తగ్గినయ్



ధరణితో పేద రైతుల భూములకు రక్షణ ఉంటది.. ధరణి వచ్చినంక భూముల ధరలు పెరిగినయ్.. అధికారుల మోసాలు తగ్గినయ్.. అమ్మినా, కొన్నా ఈజీగా రిజిస్ట్రేషన్లు అవుతున్నయ్.. నిమిషాల్లో పట్టాదారు పాసు పుస్తకం చేతికి అందుతంది.. ఎప్పుడు చూసినా మన భూమి వివరాలు మన కండ్ల ముందుంటయ్.. అక్రమాలు జరిగి ఒకళ్ల భూమిని మరొకరి పేరు మీద మార్చే ఆస్కారం ఉండదు.. రైతు వేలి ముద్రతోనే ఓపెన్ అయితది.. సమస్యలతో మాటి మాటికీ రెవెన్యూ ఆఫీసుకు వెళ్లాల్సిన పని లేదు. కాకపోతే ధరణిలో ఉన్న చిన్న చిన్న సమస్యలు పరిష్కరించాలె.

**- నాగిరెడ్డి సంజీవరెడ్డి, రైతు, ఆముదాలపల్లి (శంకరపట్నం)**

### మునుపటి కష్టాలు తప్పవు



వ్యవసాయానికి ఇప్పుడున్న కరెంటు సరఫరాతో ఎలాంటి ఇబ్బందీ లేదు. 24 గంటలు నాణ్యమైన కరెంటు ఉంటంది. బాయిలు, బోర్లళ్ల నీళ్లు పుష్కలంగా ఉన్నయి. ఎప్పుడుంటే అప్పుడు మోటర్లు ఆన్ చేసుకుని పొలాలకు నీళ్లు పెట్టుకుంటున్నం. కానీ, కాంగ్రెస్ నాయకులు చెబుతున్నట్లు మూడు గంటల కరెంటు అయితే రైతులకు మునుపటి కష్టాలు మొదలైతయ్. రైతులు భార్యా పిల్లలను వదిలిపెట్టి రాత్రంతా బాయిలు, బోర్ల కాడ జాగారం ఉండాలె. రాత్రిపూట పాములు, విష పురుగులు కుట్టి చాలా మంది రైతుల ప్రాణాలు పోయినయి. వాళ్ల కుటుంబాలు ఆగమైనయి. ఆ పాపమంతా కాంగ్రెస్‌దే. కరెంటు, నీళ్ల సౌకర్యం బాగున్న సమయంలో కాంగ్రెసోళ్లు కరెంటుతో రాజకీయం చేయడం సరికాదు. కాంగ్రెస్ నాయకులు చెబుతున్నట్లు మూడు గంటల కరెంటుకు తోడు 10 హెచ్‌పీ కరెంటు మోటర్లు పెట్టుకోవడం రైతులకు తలకు మించిన భారమే. బాయిలు, బోర్లళ్ల 10 హెచ్‌పీ మోటర్లకు సరిపడా నీళ్లు అందయి. ఇదంతా ఓట్ల రాజకీయం కోసమే. కాంగ్రెస్ నాయకులు అమలు కాని మాటలు చెబుతూ రైతులను ఆగం చేస్తున్నరు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పుడిస్తున్న అంతరాయం లేని నాణ్యమైన కరెంటు చాలా బాగుంది. వాస్తవాలను ప్రతి ఒక్క రైతు గ్రహించి, ఓపికగా ఆలోచించాలి.

**- గంగాధర లస్మయ్య, మల్కాపూర్ గ్రామం, కొత్తపల్లి మండలం(ముకరంపుర)**

### మూడు గంటలు దేనికీ సరిపోదు



ఎవుసానికి మూడు గంటల కరంటు చాలని రేవంత్‌రెడ్డి అనడం సరి కాదు. మూడు గంటల కరెంటు దేనికీ సరిపోదు. కాలువ కూడా సాగదు. పదెస్పర్ల మోటర్ వేస్తే మీది మల్లకు వేసిన పైపులన్నీ పగిలిపోతయి. రైతుల గురించి మంచిగ ఆలోచించాలె. కానీ, కాంగ్రెసోళ్లు గిట్ల మాట్లాడడం బాధేస్తంది. తెలంగాణ రాక ముందు కరెంటుతోటి ఎన్ని కష్టాలు పడ్డమో అనుభవించిన మాకు తెలుసు. కేసీఅర్ సార్ వచ్చినంక కరెంటు మంచిగ ఉంటంది. పంటలు పండుతున్నయి. పండిన వడ్లను కూడా ప్రభుత్వమే కొంటంది. రైతులను సంపడానికే మల్ల కాంగ్రెస్‌లో ప్లాన్ వేస్తున్నరు.

**- నరెడ్ల భాస్కర్‌రెడ్డి, రైతు, పెద్దపాపయ్యపల్లి(హుజూరాబాద్‌రూరల్)**

### కాల్వ సాగుతదా?



కాంగ్రెసోళ్లంటేనే భయం..భయంగుంది. ఇగ ఆ పార్టత్తే ఏమన్న ఉన్నదా.. ఇల్లిడిసి పెట్టాలె. పొలాలకాన్నే పండుకోవాలె. మళ్ల సచ్చుడైతదో.. బతుకుడైతదో.. తెల్వదు. పదేళ్లైతంది. కడుపునిండ మంచి గతింటన్నం. కంటినిండ పండు కుంటన్నం. బాయిల కాడ్కి అట్లా పోయి.. ఇట్లా అత్తున్నం. పుష్కలంగ నీళ్లుండె. 24 గంటల కరెంటి య్యవట్రి. ఇప్పటి దాకనైతే మంచిగున్నం. ఇగ కాంగ్రెసోళ్లు రాష్ట్రంల అత్తరట. ఎట్లత్తరో సూద్దాంగానీ.. వత్తేనట మూడు గంటల కరెంటిత్తమంటన్రు. మూడు గంటల కరెంటు సాల్నా. ఎట్లా సాల్తదన్న. ఒక్క మడైనా తడ్తదా ఏంది. అసలు మడి పక్కకువెట్టు.. మడికివోయే కాల్వ సాగుతదా..? ఎట్ల సాగుతదో చెప్పాలె. ఎవుసం తెల్వలేనోడు మాట్టాడే మాటలా అవి. వాళ్లనెవ్వడు నమ్ముతడు. ఇప్పుడె ఇట్ల అంటున్రు. ఇగ వాళ్ల రాజ్యమత్తే.. ఎన్కటి రోజులే. చీకట్లకు పోతం.

**- బొద్దిరెడ్డి సదాకర్‌రెడ్డి, రైతు, శంభునిపల్లి (జమ్మికుంట)**

### 10 హెచ్‌పీతో భూగర్భ జలాలు అంతం



గ్రామాల్లో రైతులు వ్యవసాయానికి 3 హెచ్‌పీ మోటర్లు మాత్రమే వాడుతున్నారు. 10 హెచ్‌పీ మోటర్లను వాడడం వల్ల భూగర్భ జలాలు తగ్గుతాయి. విద్యుత్ సరఫరాపై అదనం భారం పడుతుంది. ప్రస్తుతం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు సరిపోవు. ఇప్పుడున్న విద్యుత్ సరఫరాతో 10 హెచ్‌పీ మోటర్లు వాడితే, అవి కాలిపోయే ప్రమాదం ఉంది. రైతులకు మరింత భారమవుతుంది. రోజుకు మూడు గంటల కరెంట్ ఇవ్వడం వలన కనీసం ఒక ఎకరా పొలం కూడా తడవదు. ఐదారు ఎకరాలు సాగు చేసే రైతులకు తీవ్ర నష్టం కలుగుతుంది. ఇప్పడిస్తున్న 24 గంటల కరెంట్ సక్రమంగా వస్తుంది. మూడు గంటల కరెంట్ సరిపోతుందని కాంగ్రెస్ నాయకులు అనడం హాస్యాస్పదం. వారి అవగాహన రాహిత్యానికి నిదర్శనం.

**-తోట తిరుపతి, రైతు, దుర్శేడ్ (కరీంనగర్‌రూరల్)**

### కింది మడి నీళ్లు పారయ్..



నేను 20 ఏండ్ల నుంచి ఎవుసం చేస్తున్న. నాకు ఏడెకరాలు భూమి ఉంది. రెండెకరాలు పత్తి, రెండెకరాల మక్క, మూడెకరాలు పొలం వేసిన. నాకున్న రెండు బావుల్లో నీళ్లు పుష్కలంగా ఉన్నయ్. 5 హెచ్‌పీ మోటర్లతో పంటలు మంచిగ పండిస్తున్న. గతంల కాంగ్రెసోళ్లు పాలించినప్పుడు రాత్రి ఐదు గంటలు, పొద్దున ఒక గంట కరెంటు ఇచ్చేది. రాత్రి కరెంటు పెట్టుకోడానికి వెళ్లేటప్పుడు పాముల భయంతో చాలా ఇబ్బందులు పడ్డం. రాత్రి ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గర ఫ్యూజ్ పోతే ఆరోజు కరెంటు బందే. పొలాలు పారక ఎండిపోతుండె. ఇప్పుడు కాంగ్రెసోళ్లు మూడు గంటల కరెంట్ ఇస్తమని అంటున్నరు. అది ఎటూ సరిపోదు. కనీసం మడి కిందికి కూడా నీళ్లు పారయ్.. వాళ్ల మాటలు నమ్ముకుంటే రైతులు మునుగుడే. 10 హెచ్‌పీ మోటర్‌తో లాభాలు కాదుకదా మా కష్టం మొత్తం మోటర్ల రిపేర్లకే సరిపోతది.

**- ఏనుగు మల్లారెడ్డి, మంగళపల్లి (చొప్పదండి)**